మూలనపడ్డ ఎత్తిపోతల పథకం

- మరమ్మతులు పట్టించుకోని అధికారులు
- బీళ్లుగా మారిన రైతుల భూములు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న రైతులు

గార్ల: గార్ల మండల పరిధిలోని అంజనాపురం, రాంపురం, బుద్దారం గ్రామాల సమీపంలోని పాకాల ఏటిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలు మూలన పడి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. గార్ల మండలం అంజనాపురం, పెద్దకిష్టాపురం, చిన్నకిష్టాపురం, గ్రామాలకు చెందిన గిరిజన రైతులకు సాగునీరు అందించేందుకు పాకాల ఏటిపై 1986లో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. 40 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 3విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేశారు. ఇందుకు నాడు భద్రాచలం ఐటీడీఏ రూ.12.80లక్షలు మంజూరు చేసింది. పథకం నిర్మాణం అనంతరం దీని నిర్వహణను ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించారు. పదేళ్ల పాటు ఈ పథకం సజావుగా సాగింది. 400 ఎకరాలకు సాగునీరు అందడంతో ఈ ప్రాంత గిరిజన


నిరుపయోగంగా పైపులు

రైతులకు లబ్ధి చేకూరింది. లిఫ్ట్ నిర్వహణను భారంగా భావించిన ఇరిగేషన్ శాఖ 1996లో ఆయకట్టు రైతు అభివృద్ధి కమిటీకి అప్పగించింది. అప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. 1999లో విద్యుత్ బకాయిలు రూ.10లక్షలకు చేరాయి. బకాయిలను రైతులు చెల్లించలేకపోయారు. మరో పక్క విద్యుత్ మోటార్లు కాలిపోయాయి. దీంతో పథకం మూతబడింది. ఆయకట్టు కింది 400ఎకరాలు సాగుభూములు బీడు భూములుగా మారాయి. పైపులైన్లు, షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. 3 కిలోమీటర్ల మేర పొడవున తవ్విన పంటకాల్వలు పూడిపోయాయి.


మూలన పడ్డ రాంపురం ఎత్తిపోతల పథకం షెడ్డు

రూ.10.30లక్షల నిధులు విడుదల

ఈ పథకానికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకోగా 10సంవత్సరాల క్రితం భద్రాచలం ఐటీడీఏ అధికారులు స్పందించి రూ.10.30లక్షల నిధులు విడుదల చేశారు. ఈపనులకు టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. పాకాల ఏటిలో సమృద్ధిగా నీరున్నా రైతుల పంటలు సాగుకు నోచుకోవడంలేదు. దీంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. ఈవిషయంపై ఆయకట్టు గిరిజన రైతులు గత 10 ఏళ్ల క్రితం నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా నాటి కలెక్టర్ సిద్ధార్థజైన్‌ను కలువగా ఆయన మండల అధికారులు జోక్యం చేసుకొని మరమ్మతు పనులు నిర్వహించాలని లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీచేశారు.

మరమ్మతులు చేపట్టి సాగునీరందించాలి

దీంతో మండల అధికారులు గత 10సంవత్సరాల క్రితం అంజనాపురం గ్రామంలో అయకట్టు రైతులను ఐక్యం చేసేందుకు 2సార్లు గ్రామసభలు నిర్వహించగా కొంత మంది రైతులు తమ భూముల నుంచి పైప్‌లైన్ వేయనీయమని తేల్చి చెప్పడంతో ఇక ఎత్తిపోతల పథకం పనులు నిర్వహించడం కష్టమని అధికారులు చేతులెత్తేశారు. దీంతో పథకం మరమ్మతు పనులు కాంట్రాక్టర్ చేపట్టలేదు. అదేవిధంగా మండలంలోని రాంపురం, బుద్దారం సమీపంలోని పాకాల ఏటిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలు సైతం మూలన పడ్డాయి. ఈఎత్తిపోతల పథకాల మోటార్లు కాలిపోవడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యారు. జిల్లా అధికారులు స్పందించి మండలంలోని అంజనాపురం, రాంపురం, బుద్దారం ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి రైతుల పంట భూములకు సాగు నీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పాదయాత్ర విజయవంతం చేయాలి



కొత్తగూడ: షెడ్యూల్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు కోరారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 3, 1/70, పీసా చట్టాలతో షెడ్యూల్డ్ యాక్టులను సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ గంగారం మండల కేంద్రం నుంచి కొత్తగూడ వరకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో కల్తి వీరస్వామి, శివకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

గార్ల: గార్లలోని సైడ్ డ్రైయినేజీలో పూడిక పేరుకుపోయి దోమల ఉధృతి ఎక్కువ కావడంతో ఆదివారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ పంచాయతీ సిబ్బందిచే ముమ్మరంగా పూడికతీత పనులు చేపట్టారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ జె.కిషోర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.54వేల విరాళం అందజేత



కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో ఈనెల 14నుంచి 16వరకు నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్టాపనకు గాను, మున్నూరు కాపు గ్రామ సంఘం ఆధ్వర్యంలో రూ.54వేల విరాళాన్ని సర్పంచ్ గంట సంజీవరెడ్డి సమక్షంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పెరుమాండ్ల ఎల్లాగౌడ్, కొంతం శ్రీను, గంట బాలక్రిష్టారెడ్డి, గంట రామ్మోహన్‌రెడ్డి, పెరటి వెంకట్రామనర్సయ్య, యాకయ్య, రవీందర్ గౌడ్, దినేష్, కూన భద్రాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు రక్షణ కల్పించాలి


పందులు ధ్వంసం చేసిన పంట

గూడూరు: మండలంలోని సీతానగరం శివారు ప్రాంతంలోని రైతులు పండించే మొక్కజొన్న, పచ్చజొన్న పంటలకు అడవి పందుల నుంచి రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు. ప్రతీ సంవత్సరం ఎంత కష్టపడి పండిస్తున్న మొక్కజొన్న ఇతర పంటలు చేతికొచ్చే సమయానికి అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి అడవి పందులు పంట చేలపైకి రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని మొక్కజొన్న నష్టపోయి రైతులు రమణారెడ్డి, సురేందర్‌రెడ్డి కోరుతున్నారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని నర్సంపేట రోడ్డులో గల శ్రీమహాగాయత్రి దేవి అమ్మవారి దేవాలయంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు వంకోజు జలేంద్రాచార్యులు ఆదివారం తెలిపారు. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పన, ధ్వజారోహణం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కురవి: మండలంలోని నేరడ గ్రామంలో ఆదివారం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి-చెంచులక్ష్మీల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలను మదూరు యాకయ్య-స్వరూప, నీలం నాగరాజు-నిర్మల దంపతులు కూర్చొని నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బయ్య, రమణ, సుమన్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లింగమంతుల జాతర



కేసముద్రం: మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో లింగమంతుల జాతర పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి యాదవులు పూలగంపలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. అదేవిధంగా ఇళ్లలో పసుపు, కుంకుమలతో పుదించిన బోనాలకు పూజలు నిర్వహించి, మేళతాళాల నడుమ బోణాలను ఎత్తుకుని ఊరేగింపుగా బయలుదేరారు. మొక్కులు చెల్లించుకున్నారు.

అన్నదానం

కేసముద్రం: మాఘపూర్ణిమ పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర రైస్‌మిల్లులో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో తౌనుపునూరి వెంకటేశ్వర్లు, భాస్కర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కురవి: మంత్రి సత్యవతిరాథోడ్ ఆదివారం కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్దతండా జీపీలో తన తండ్రి గుగులోత్ లింగ్యానాయక్ సంవత్సరికం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజకీయంగా బీసీలకు అన్యాయం


మాట్లాడుతున్న శంతన్ రామరాజు

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20వేల కోట్లతో బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ.. బీసీలు తమ హక్కుల సాధన కోసం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో బీసీలకు అత్యధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం బీసీలకు కేటాయించిన నిధుల ఖర్చుకు శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. బీసీలకు నామమాత్రంగా రుణాలను మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని, విద్య, వైద్యం, ఉద్యోగ పదోన్నతుల్లో రాజకీయంగా బీసీలు తీవ్రంగా అసమానతలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీసీలు కళ్లు తెరిచి ముందు తరాలకు భవిష్యత్ చూపించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సాగర్, రామరాజు, శ్రీమన్, అంజయ్య, రాం, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

'సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి మాకు సంబంధం లేదు'

దంతాలపల్లి: మండలం బిరిశెట్టిగూడెం గ్రామ సర్పంచ్ నెహ్రూనాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించడానికి మాకు ఎలాంటి సంబంధంలేదని ఉప సర్పంచ్ డోనికన స్వాతి ఆమె భర్త వెంకన్న మరో వ్యక్తి పాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉద్దేశ పూర్వకంగానే కొందరు మాపై అక్రమ కేసులు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్ సొంత కుటుంబ సభ్యుల కలహాలు, మానసిక ఒత్తిడి వలనే పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడని, ఆ విషయం గ్రామప్రజలకు తెలుసన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజాలను తేల్చి చర్యలు తీసుకోవాలని కోరారు.

ముళ్లపొదలను తొలగించాలి


ప్రమాదకరంగా ముళ్లపొదలతో పినిరెడ్డిగూడెం నుంచి బాలాజీతండా వెళ్లే రహదారి

గార్ల: మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామం నుంచి బాలాజీతండా వెళ్లే బీటీ రహదారికి ఇరువైపుల మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న ముళ్లపొదలను సంబంధిత అధికారులు వెంటనే తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ రహదారిలో వాహనాలు, బైక్‌ల ద్వారా వెళ్తూ మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించక ఢీకొని చాలా మంది గాయాల పాలయ్యారు. ఇటీవల ఓ వ్యక్తి ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారికి ఇరువైపుల ఉన్న ముళ్లపొదలను తొలగించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న సోమయ్య

పెద్దవంగర: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెదగాని సోమయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్‌తో కలిసి శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో మాట్లాడారు. మండలంలోని అన్ని బూత్ కమిటీలను, శక్తి కమిటీ కేంద్రాలను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ఈనెల 10నుంచి 25 వరకు శక్తి కేంద్రాల్లో స్ట్రీట్‌కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలని, కేసీఆర్ గద్దె దిగే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లేగ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు తలారి సోమయ్య, గడపురం భిక్షపతి, సాయిని ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: హమాలీ కార్మికులకు సమగ్ర వేతన చట్టం అమలు, కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల యాకయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో హమాలీ కార్మికుల సమగ్ర వేతన చట్టం కోసం ఫిబ్రవరి 9న జరుగనున్న చలో హైదరాబాద్ కార్యక్రమ కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జక్కుల యాకయ్య మాట్లాడుతూ.. హమాలీ సంక్షేమం కోసం చట్టాలు ఉన్న వాటిని అమలు చేసే చిత్తశుద్ధి పాలకులకు లేదన్నారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, సూర్యం, అశోక్, సురేష్, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

పెద్దవంగర: అక్రమంగా తరలిస్తున్న మద్యంతోపాటు 70కేజీల నల్లం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మండలంలోని వడ్డె కొత్తపల్లి గ్రామపరిధిలోని సబ్‌స్టేషన్ వద్ద పోలీసుల వాహనాలు తనిఖీ చేపట్టారు. కొరిపల్లి గ్రామానికి చెందిన ఎండీఏ ముస్తాఫా తను నిర్వహిస్తున్న కిరాణం షాపునకు సూర్యాపేట జిల్లా తిర్మలగిరి మండల కేంద్రం అదే గ్రామానికి చెందిన ఎడ్ల సందీప్‌కు చెందిన అంబులెన్స్‌లో మద్యంను తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనంలో 14 మద్యం బాటిళ్లు, 70 కేజీల నల్లబెల్లం పట్టుకున్నారు. దీంతో అంబులెన్స్‌తోపాటు వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వరద శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ మధు, శ్రీనివాస్, కుమార్ ఉన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం



గడ్డిగూడెం తండాలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని గడ్డిగూడెం తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం కారణంగా నిరుపయోగంగా మారి దర్శనమిస్తుంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని, విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించాలని క్రీడా ప్రాంగణాల ఏర్పాటు ప్రారంభించింది. ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేర్చే పనులను పర్యవేక్షించాల్సిన సంబంధిత బాధ్యులు పట్టించుకోకుండా వ్యవహరించడం ద్వారా అవి అలంకార ప్రాయంగా మారిపోతున్నాయి. గడ్డిగూడెంతండా గ్రామంలో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం కనీసం సరైన బోర్డు కూడా ఏర్పాటు చేసేందుకు నోచుకోకుండా కనిపిస్తుంది. కేవలం నామమాత్రంగా ఏదో ఏర్పాటు చేయలేదు అనకుండా ఒక మాములు బోర్డును ఏర్పాటు చేసి స్థలం హద్దులు నిర్ణయించడం, క్రీడా ప్రాంగణంలో పూర్తి పనులు చేయడం మొదలు పెట్టలేదు. పొలం, ఇంటి సరిహద్దులో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు నిర్ణయం తీసుకుని అలాగే వదిలేశారు.

వైభవంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన


ముత్యాలమ్మతల్లి దేవాలయం వద్ద జనసందోహం


బోనాలతో శివసత్తులు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్


బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్


పోతురాజుల విన్యాసం


బొడ్రాయి పూజల్లో పాల్గొన్న నాయకులు


యాగశాలలో పూజలు చేస్తున్న పండితులు

జిల్లా కేంద్రంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు ఆదివారం భక్తజనంతో అంగరంగ వైభవంగా జరిగాయి. ఎక్కడ చూసినా సరే జనమే కనిపించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమం, రత్నన్యాస, బీజన్యాస, ధాతున్యాస పూజలు జరిగాయి. మానుకోట జిల్లా కేంద్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ గ్రామ దేవతలను వేడుకుంటూ పూజలు నిర్వహించారు.

- మహబూబాబాద్ రూరల్

నాణ్యతతో పనులు చేపట్టాలి

ఖానాపురం : నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతున్న సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేట, ధర్మారావుపేట గ్రామాల మధ్య చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ నర్సంపేట నియోజకవర్గానికి 110కిలో మీటర్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. అన్ని గ్రామాల్లో నిర్మాణ పనులు ప్రారంభమై వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామాలు, తండాల్లో సీసీ, బీటీ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మించడానికి కృషి చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడతా

నర్సంపేట: సంక్షేమంతో పాటు సామాజిక అభివృద్ధికి పాటు పడతానని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నియోజకవర్గ పద్మశాలీ కులస్తులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరి స్వార్థ పూరిత కుట్రల వల్ల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ ప్రక్రియ ఆలస్యం అయిందన్నారు. అయినప్పటికీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృషితో నర్సంపేట నియోజకవర్గంలోని కుల సామాజిక వర్గాలకు ఆత్మగౌరవ భవనాల మంజూరు సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో రుద్ర ఓంప్రకాశ్, బాల్నె సర్వేశం పాల్గొన్నారు.

యువత సమాజ సేవలో ముందుండాలి

చెన్నారావుపేట: యువత సమాజసేవలో ముందుండాలని ఏసీపీ సంపత్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పాపయ్యపేట పంచాయతీ ఆవరణలో ఆదివారం సన్నీ యువసేన ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు రక్తదానం చేశారు. స్థానికులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మదూరి అఖిల్‌గౌడ్, ఎస్సై తోట మహేందర్, సర్పంచ్ ఉప్పరి లక్ష్మీ, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మొగిళి రమా, కేశవరెడ్డి, తదితరులు ఉన్నారు.